# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని ప్రతీ పంచాయతీలో ఆదర్శ ప్రాధమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో అవగాహన పెంపొందించడం అవసరమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు.
- నాబార్డు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
- విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

==============================

రాష్ట్రంలోని ప్రతీ పంచాయతీలో ఆదర్శ ప్రాధమిక పాఠశాలలను ఏర్పాటు చేస్తామని ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను ఆయన ఈ రోజు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... 2025-26 బడ్జెట్ లో రాష్ట్రానికి అత్యధికంగా నిధులు కేటాయించాలని కేంద్రమంత్రిని కోరామని తెలిపారు. కేజీబీవీలు, నైపుణ్య విద్య, ఐసీటీ ఆధారిత అభ్యాసం, నాణ్యత పెంపుదలకు కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధుల కేటాయింపులు చేయాలని కోరామని వివరించారు. ఈ సంవత్సరం ఆగస్టులో నిర్వహించబోయే “అఖిల భారత విద్యా మంత్రుల సమ్మేళనా”న్ని ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేసే అవకాశం కల్పించాల్సిందిగా కోరినట్లు మంత్రి లోకేష్ చెప్పారు.

==============================

రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాలలో అవగాహన పెంపొందించడం అవసరమని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అనంతపురంలో ఈ రోజు అనంత ఉద్యాన సమ్మేళనాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ... రైతులకు ఆదాయం రెండింతలు చేసేందుకు సాంకేతిక అవగాహన దోహదపడుతుందని అన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. అనంతపురాన్ని ఉద్యానవన కేంద్రంగా మార్చాలన్నది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

============================

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తూ.. కేంద్ర రైల్వే శాఖ ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ రైల్వే డివిజన్ ను దక్షిణ కోస్తా రైల్వే జోన్ లో భాగం చేశారు. ప్రస్తుతం ఉన్న వాల్తేరు డివిజన్ ను విశాఖ డివిజన్ గా మారుస్తారు. విశాఖ డివిజన్ తో పాటు రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు దక్షిణ కోస్తా జోన్ లో ఉండనున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. విశాఖ రైల్వే డివిజన్‌లో పలాస నుంచి విశాఖపట్నం దువ్వాడ, కూలేరు నుంచి విజయనగరం, నౌపడు జంక్షన్ వరకు.. సింహాచలం నార్త్ నుంచి దువ్వాడ బైపాస్ వరకు వడ్లపూడి నుంచి దువ్వాడ - విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వరకు రైల్వే ట్రాక్ మొత్తం విశాఖ రైల్వే డివిజన్‌లోకి వస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

============================

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాబార్డు ద్వారా ప్రయోజనం చేకూర్చేలా ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడలో ఈ రోజు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) - నాబార్డు, ఖేతి ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ తో 2 అవగాహన ఒప్పందాలు చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 10 కోట్ల రూపాయల వ్యయంతో 293 యూనిట్ల ద్వారా 5 వేల మంది సెర్ప్ సభ్యులకు ఈ ఒప్పందాల మధ్య మేలు జరుగుతుందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

============================

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో 17 మంది సభ్యులతో బోర్డును ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఛైర్మన్ కొనకళ్ల నారాయణ సహా ఆరుగురు నామినేటెడ్ సభ్యులు, 11 మంది అధికారులతో ఆర్టీసీ బోర్డు పని చేయనుంది. ఆర్టీసీ ఎండీ, ఆర్థిక, రవాణా, సాధారణ పరిపాలన శాఖ, ఇతర శాఖలు, విభాగాల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. రెండు సంవత్సరాల పాటు ఆర్టీసీ వ్యవహారాలను పర్యవేక్షించేలా ఈ బోర్డు పని చేస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

============================

ప్రతీ వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ప్రాంతీయ రవాణా అధికారి కె.మురళీమోహన్ కోరారు. తిరుపతిలోని ఆర్టీఓ కార్యాలయంలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, జనవరి నెల 16 నుండి ప్రారంభమైన రహదారి భద్రతా మాసోత్సవాలు ఈనెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని అన్నారు. ఈ సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.

విరామం

============================

పరిశ్రమల్లో భద్రతాపరమైన చర్యల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖపట్నంలో ఒక ప్రైవేటు సంస్థలో జరిగిన ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె ఈరోజు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొంటూ....

(వాయిస్ 28 సెకన్లు)

==============================

రాష్ట్రంలో ప్రకృతి వనరులను కాపాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడలో ఈ రోజు పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... ప్రజల కొనుగోలు శక్తిని పెంచే మార్గాలను అన్వేషించాలని సూచించారు. తద్వారా ఉపాధి పెరుగుతుందని, అప్పుడు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని శ్రీనివాసరావు అన్నారు.

==============================

రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

గ్రామస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటనలో భాగంగా ఈ రోజు స్థానిక పెద్దపంజాణి మండల కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

==============================

తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో రేపటి నుండి ఈ నెల 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించునున్నట్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. 7 రోజుల పాటు సాయంత్రం 6 గంటల 30 నుండి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో కలిసి శ్రీ గోవిందరాజస్వామివారి పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తారని అధికారులు తెలిపారు.

==============================

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అన్యమత ఉద్యోగులపై చర్యలు చేపట్టినట్లుగా అధికారులు తెలిపారు. గతేడాది నవంబరు 18న బోర్డు సమావేశంలో తీర్మానం మేరకు అన్యమతస్తులపై చర్యలు తీసుకోవాలని టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు సూచించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారులు టీటీడీ విధుల్లో ఉన్నప్పుడు అన్యమత ఆచారాలు పాటించిన 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించారు. వారిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని నిర్ణయించారు.

==============================

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఈ నెల 11 నుండి 13వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లుగా అధికారులు ఈరోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ

మూడు రోజులలో మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 4 గంటల వరకు భజన మండళ్లతో నామ సంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేశాలు ఉంటాయని వెల్లడించారు.

==============================

==============================